జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 20-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 169 పేజీలు: 8 వెల : రూ.7






## జిల్లా ఎస్పీ కార్యాలయంలో..

# క్లర్కులదే హవా!

* జిల్లా పోలీసు కార్యాలయంలో కొందరు సిబ్బంది చేతివాటం
* పోలీస్.. ఎస్ఐ ర్యాంకర్ల నుంచి ముడుపులు వసూళ్లు
* దీనిపై గత ఎస్పీకి ఫిర్యాదు * గతంలో ఏవో, క్లర్క్‌పై విచారణ
* ఉన్నతాధికారులకు తప్పుదోవ పట్టిస్తున్న పలువురు క్లర్కులు, ఏవోలు
* బాస్ దృష్టి సారిస్తే పోలీసులకు న్యాయం జరిగే అవకాశం

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 19(వార్త):** పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని, వారి సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరిస్తానని, శాఖాపరంగా ఏమైనా బిల్లులు రావాల్సివుంటు అందేలా చేస్తామని జిల్లా పోలీస్‌బాస్, యువ ఐపీఎస్ కేవీ మహేశ్వరరెడ్డి చెబుతున్నారు. అయితే జిల్లా పోలీసు కార్యాలయంలో కొందరు కార్యాలయ సిబ్బంది నిబంధనలు పాటించడం లేదు. కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ ర్యాంకర్ వరకూ ఆర్థికపరమైన బిల్లులు కావాలంటే కార్యాలయ సిబ్బందికి చేయి తడపాల్సివస్తోంది. ఎవరైనా ఇవ్వకుంటే వారి ఫైల్ నెలల కొద్దీ పెండింగ్‌లో ఉండిపోతుంది. దీంతో వారు క్లర్కులు, ఏవోల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సివస్తోందని కొందరు పోలీసులు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. అయితే ఈవిషయం జిల్లా పోలీస్ బాస్ దృష్టికి తీసుకువెళితే తమకు ఇబ్బందులు ఎదురవుతాయేమోనని కొందరు సైలెంట్ అవుతున్నారు. కార్యాలయంలో పాతుకుపోయిన కొందరు క్లర్కులు రికార్డు అసిస్టెంట్లు, ఏవోలు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఒక బిల్లు పాస్ అవ్వాలన్నా, ఇంక్రిమెంట్ వెయ్యాలన్నా, ఒక డీఏ, హౌస్ రెంట్ బిల్ పాస్ చేయాలన్నా వీరి చుట్టూ తిరగాల్సివుంటుంది. మరో విషయం ఏమిటంటే వీరు డబ్బులు తీసుకోరు.. వస్తు రూపంలో మాత్రమే ఆమ్యామ్యాలు తీసుకుంటారన్న గుసగుస ఉంది. కొందరు కార్యాలయ సిబ్బందిపై గతంలో ఎస్పీకి ఫిర్యాదులు కూడా అందాయి. దీంతో వీరిపై ఎంక్వయిరీ కూడా వేశారట. అంతేగాకుండా క్లర్కులు, పోలీసుల మధ్య వారధిగా ఓ కానిస్టేబుల్ కూడా నియమించారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పెండింగ్ ఫైల్స్ కోసం ఆ కానిస్టేబుల్‌కి ఎన్నిసార్లు అడిగినా చేస్తారు చేస్తారు అని చెబుతున్నారు తప్ప ఫైల్ ముందుకుకదలడం లేదు. గతంలో పోలీస్‌బాస్‌కు ఫిర్యాదు వెళ్లడంతో ఈసారి కొందరు క్లర్కులు, సూపరింటెండెంట్లు చాలా జాగ్రత్తలు పడుతున్నారు. జిల్లా పోలీస్‌బాస్ పోలీసులకు సంబంధించి గ్రీవెన్స్ ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకుంటున్నారు. అయితే కొందరు కార్యాలయ సిబ్బంది తీరుపై ఎవరూ నోరు మెదపలేకపోతున్నారు. ఇకనైనా జిల్లా పోలీస్‌బాస్ దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తే మరిన్ని నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## పాత్రికేయుల ప్రతిష్ట పెంచేలా..

# జాప్ సేవలు

* జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా సేవలు * జాప్ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు * ఖ్యాతి ఫౌండేషన్‌లో జాప్ 32వ వార్షికోత్సవం
* వృద్ధులకు స్వెట్టర్లు, దుప్పట్లు పంపిణీ * రెండు పూటలా భోజనం ఏర్పాటు

**శ్రీకాకుళం, నవంబర్ 19(వార్త):** సమాజంలో పాత్రికేయులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, పాత్రికేయుల ప్రతిష్టను పెంచే విధంగా జాప్ చేస్తున్న సేవలు నిరుపమానమని జర్నలిస్టు యూనియన్ నాయకులు శాసపు జోగినాయుడు, కొంక్యాన వేణుగోపాల్, జి షన్ముఖరావు అన్నారు. జాప్ జిల్లా అధ్యక్షులు జి.షణ్ముఖ రావు నేతృత్వంలో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) 32వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శ్రీకాకుళం నగరంలోని ఖ్యాతి ఫౌండేషన్‌లో మంగళవారం నిర్వహించారు. వృద్ధులకు దుప్పట్లు, స్వెట్లర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజ నిర్దేశకులని కొనియాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తూ సమాజం పట్ల ఎంతో బాధ్యతతో వ్యవహరిస్తున్నారన్నారు. జాప్ ఎప్పుడూ జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న వేళ ఎందరో జర్నలిస్టులు తమ ప్రాణాలకు తెగించి వార్తలను సేకరించి ప్రజలకు అందజేశారని వివరించారు. ప్రజలను చైతన్యం చేయడంలో జర్నలిస్టులు ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. జర్నలిస్టు వృత్తి ఎంతో పవిత్రమైనది, ఆ వృత్తిలో ఉండే వారు సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని హితవు పలికారు. ఖ్యాతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ శ్రావణి చిరు ఉద్యోగం చేస్తూ వృద్ధులకు చేతనైన సాయం అందిస్తున్నారని అలాంటి వారికి చేయూతనివ్వాలని ఆలోచనతోనే ఖ్యాతి ఫౌండేషన్‌లో వృద్ధులకు దుప్పట్లు, స్వెట్టర్లు పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. జాప్ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజహిత కార్యక్రమాలకు పాటు పడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు కొంక్యాన మురళి ధర్, జర్నలిస్ట్ లు బాలకృష్ణ పట్నాయక్, డాక్టర్ గంజి ఎజ్రా, ఎంవీ సత్య నారాయణ, డోల శంకర్, పిన్నింటి అప్పన్న, సీపాన రమేష్, రౌతు సూర్యనారాయణ, శర్మ, కృష్ణకాంత్, కొండబాబు, రాధ, అల్లు ఉమామహేశ్వరరావు, ఆకుల కృష్ణ, కొంక్యాన శంకర్, శ్యామ్, పృద్వీ, ప్రభాస్ సూర్య, బొచ్చెన లక్ష్మణ్, ఆర్.వెంకటట్, దుక్క రాజు, బి.భాగ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మున్సిపాలిటీలో పర్యటించిన కమిషనర్



**పలాస, నవంబర్ 19(వార్త):** పలాసలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామారావు పర్యటించారు. పారిశుధ్యం, డంపింగ్ యార్డులో పరిస్థితిని పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో అక్రమ నిర్మాణాలపై చర్చించారు. ఏఐఐబీ స్కీంలో భాగంగా మున్సిపాలిటీలోలో పైప్ లైన్ వేయడానికి గతంలో తీసుకొచ్చిన పైపుల పరిస్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బొందికరి బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళికలు

**మందస, నవంబర్ 19(వార్త):** చీపి పంచాయతీ బొందికరి గ్రామ సమీపంలోని పలు గిరిజన గ్రామాల ప్రజల కల నెరవేరనుంది. ఈ గ్రామాలను కలిపే బ్రిడ్జి 15ఏళ్ల క్రితం కూలిపోయింది. అప్పటి నుంచి ఆయా గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గుయ్యేవారు. వర్షాలు అధికంగా కురిసేటప్పుడు ఈ నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రాకపోకలకు అంతరాయం కలిగేది. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించడంలో బ్రిడ్జి నిర్మాణం పనుల్లో కదలిక ప్రారంభమైంది. ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక దృష్టి సారించారు. బ్రిడ్జి నిర్మాణానికి కావాల్సిన వనరులు, నిధులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఐటీడీఏ ఇంజనీర్లకు ఆమె ఆదేశించారు. దీంతో మంగళవారం ఐటీడీఏ డీఈఈ బలివాడ కృష్ణకుమార్, జేఈ అబ్రహం, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజుతో పాటు పలువురు నాయకులు బొందికరి బ్రిడ్జిని



పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు వేసి, ఎమ్మెల్యే శిరీషకు అందిస్తామని వారు చెప్పారు. బ్రిడ్జి పనుల్లో కదలిక రావడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచండి




**నరసన్నపేట, నవంబర్ 19(వార్త):** విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచే దిశగా కృషి చేయాలని ఎంఈవో ఉప్పాడ శాంతారావు తెలిపారు. మంగళవారం ఆయన నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. అనంతరం ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హర్షవర్ధన్, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీ బి.గిరిధర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

**జలుమూరు:** స్కూల్ కాంప్లెక్స్ సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో బమ్మిడి మాధవరావు అన్నారు. మంగళవారం ఆయన కరవంజ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌ను తనిఖీ చేశారు. తగు సూచనలు, సలహాలను ఉపాధ్యాయులకు అందజేశారు. శ్రీముఖలింగంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో సముదాయ సమావేశం నిర్వహించినట్టు ఎంఈఓ ప్రసాదరావు తెలిపారు. అపార్ నమోదు వేగవంతం చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనం నాణ్యంగా విద్యార్థులకు వండిపెట్టేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.



# ఇందిరాగాంధీకి ఘన నివాళులు





**సారవకోట, నవంబర్ 19(వార్త):** సారవకోట గ్రంథాలయంలో మంగళవారం భారత తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైస్కూల్ విద్యార్థినులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. గ్రంథాలయ అధికారులు డి. సాయమ్మ, సహాయ అధికారి ఆర్.దుర్గాజీ, స్థానికులు పాల్గొన్నారు.

**నరసన్నపేట:** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు మంగళవారం నరసన్నపేటలోని పెద్దపేట వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**మెళియాపుట్టి:** మెళియాపుట్టిలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి అనురాధ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాగాంధీ జయంత్యుత్సవం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గ్రీష్మ, అలేఖ్య, మహిళ పోలీస్ భారతి, స్థానికులు నీలిమ, జయంతి, సంతోషిని, సహాయకురాలు హేమలత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**మందస:** మందసలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. తొలుత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందిరా చిత్రపటానికి గ్రంథాలయ అధికారిణి విజయలక్ష్మి, సూర్యోదయ స్కూల్ తెలుగు టీచర్ ఎం.ధర్మారావు, వాసుదేవు, హరిబంధు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు.








## త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

**నరసన్నపేట, నవంబర్ 19(వార్త):** నరసన్నపేట మండలంలో త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని వ్యవసాయ శాఖ అధికారి సునీత తెలిపారు. మంగళవారం ఆమె కంబకాయ పంచాయతీలో పొలం పిలుస్తుంది చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం అమ్మకాలకు రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## అపార్ నమోదుకు తప్పని అవస్థలు



**జలుమూరు, నవంబర్ 19(వార్త):** విద్యార్థుల పుట్టినతేదీల్లో తేడాలు ఉండడంతో అపార్ నమోదు ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా అవస్థలు పడుతున్నారు. నరసన్నపేటలో మంగళవారం పలు పాఠశాలలో ఈ దుస్థితి కనిపించింది.

## మూడో విడత ఎన్సీడీసీడీ సర్వే ప్రారంభం



**నరసన్నపేట, నవంబర్ 19(వార్త):** నరసన్నపేటలో మంగళవారం ఎన్సీడీసీడీ 3వ విడత సర్వేలో భాగంగా మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. మధుమేహం, హిమోగ్లోబిన్, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయం ముఖద్వారం వంటి పరీక్షలను ఎంఎల్‌హెచ్‌పీ యమున, ఏఎన్ఎం లలిత చేపట్టారు. 18 సంవత్సరాలు ఉన్న ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## ఆయుర్వేద వైద్యంపై శిక్షణ

**మందస, నవంబర్ 19(వార్త):** మందసలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుర్వేద వైద్యంపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. వైద్యాధికారి మద్దిల సంపత్‌రావు ఆధ్వర్యంలో ఆయుర్వేద మందుల వాడకాన్ని ఆయుర్వేద వైద్యులు సోమేశ్వరరావు వివరించారు. గ్రామాల్లో ఫీవర్ సర్వే చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షించాలని సూచించారు. గర్భిణులను గుర్తించి, ప్రసవాలకు ప్రభుత్వాసుపత్రికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఈవో కృష్ణారావు, పీహెచ్ ఎన్.పెంటమ్మ, రుక్మిణి, సిబ్బంది పాల్గొన్నారు.



## నేడు మందసలో నేత్ర వైద్య శిబిరం

**మందస, నవంబర్ 19(వార్త):** మందసలోని సత్యసాయిసేవా సమితి(బృందావనం)లో ఈనెల 20న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు శంకర్ ఫౌండేషన్ క్యాంప్ జూనియర్ మేనేజర్ టి.రామారావు, సత్యసాయి సేవాసమితి ప్రతినిధి వడ్డీ అప్పారావు తెలిపారు. శిబిరానికి వచ్చే రోగులు ఆరోగ్యశ్రీకార్డు, ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, ఫోన్ నంబరు, రెండు జతల దుస్తులు. ప్లేట్, గ్లాస్ తీసుకురావాలని సూచించారు. వివరాలకు 9848907299, 9949756659 అనే ఫోన్ నంబర్లుకు సంప్రదించాలని కోరారు.

## ఏరియా ఆస్పత్రి పనులు పూర్తి చేయాలి




**నరసన్నపేట, నవంబర్ 19(వార్త):** నరసన్నపేట ఏరియా ఆసుపత్రి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో ఈ విషయం సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రి పనులు త్వరగతిన పూర్తి చేసి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.



## నిరుపేదలకు దుస్తుల పంపిణీ

**ఇచ్ఛాపురం, నవంబర్ 19(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి 6వ వార్డుకు చెందిన పరపటి నాగరాజు రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా మంగళవారం నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కౌన్సిలర్ పరపటి మంజులత, వైస్సార్సీపీ నాయకులు పరపటి కోటిరెడ్డి వీటిని అందించారు.

## మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



**పలాస, నవంబర్ 19(వార్త):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఉదయపురంలో జెమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులకు వివిధ వైద్య పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. శిబిరంలో జెమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఐ.ప్రదీప్, బీజేపీ పట్టణ అధ్యక్షులు వైశ్యరాజు మోహన్‌రాజు, 27వ వార్డ్ ఇన్‌చార్జి రామాయణం కృష్ణమాచార్య, తలాసు మదన్, బి.షణ్ముఖరావు, రాజాం జోగారావు, ఏలూరు ప్రసాదరావు, టి.శంకరరావు, కె.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో వల్లభరావు మాస్టారు మృతి



**పలాస, నవంబర్ 19(వార్త):** పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన ఎస్.వల్లభరావు మాస్టారు మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారు. సామాజిక సేవలో కూడా ముందుండేవారు. ఆయన మృతి బొడ్డపాడు గ్రామానికే కాకుండా ఉద్దాన ప్రాంతానికి తీరని లోటు. ఆయన మృతికి విద్యార్థులు, ఉద్దాన ప్రజలు సంతాపం తెలిపారు.

## మానవ సేవయే ...మాధవ సేవ!



**వంగర, నవంబర్ 19(వార్త):** మానవ సేవయే మాధవ సేవని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతీస్వామి అన్నారు. మంగళవారం ఆయన వంగరలోని వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రులను, గురువులు, పెద్దలను గౌరవిస్తూ క్రమశిక్షణ కలిగిన విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. పాఠశాల యాజమాన్య సభ్యులు బెవర ఈశ్వరరావు, కనగల పారినాయుడు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## మడ్డువలసలో డ్రంకెన్ డ్రైవ్

**వంగర, నవంబర్ 19 (వార్త):** మడ్డువలస జంక్షన్‌లో మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ షేక్ శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రతి ఒక్క వాహన చోదకుడిని తనిఖీ చేశారు. ఏ ఒక్కరూ వాహనాల మీద ప్రయాణించే సమయాల్లో మందుకు దూరంగా ఉండాలని సూచించారు.



# జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



**పాతపట్నం, నవంబర్ 19(వార్త):** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో పాతపట్నం నియోజకవర్గం దూసుకుపోతోంది. ఐదు మండలాలు కలిపి 40,054 మంది నూతన సభ్యత్వాలు, రెన్యువల్ చేసుకోగా ఉత్తరాంధ్రలో ప్రథమ, రాష్ట్రంలో 10 స్థానంలో నియోజకవర్గం కొనసాగుతున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బంది తెలిపారు.

**సారవకోట:** లక్ష్మీపురంలో మంగళవారం 80 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నట్టు సారవకోట మండల టీడీపీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, సర్పంచ్ పొదిలాపు కృష్ణారావు పాల్గొన్నారు.



# బెల్ట్ షాపులపై ఎక్సైజ్ శాఖ దాడి



**మందస, నవంబర్ 19(వార్త):** మందస మండలంలోని బెల్ట్ షాపులపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహించినట్టు సీఐ కె.బేబి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో సారా తయారీ, అమ్మకాలు, ఎగుమతి జరుగుతున్నట్టు గుర్తించామన్నారు. ఈ దాడుల్లో 10 బెంగళూరు విస్కీ, 5ఆఫీసర్స్ చాయిస్ సీసాలను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేశామన్నారు. మందస, కంచిలి, సోంపేట మండలాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించామని, 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా, బెల్ట్ షాపులకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను సోంపేట మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేశామన్నారు. నేషనల్ హైవేకు ఆనుకుని ఉన్న దాబా హోటళ్లలో ఆకస్మిక దాడులు చేపట్టామన్నారు.

# 22న అమరవీరుల స్మారక సభ

**పలాస, నవంబర్ 19(వార్త):** అమరవీరుల స్మారక సభను విజయవంతం చేయాలని కోరుతూ న్యూడెమోక్రసీ పార్టీ మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించింది. ఈనెల 22న ఉదయం 9గంటలకు వజ్రపుకొత్తూరు మండలం మర్రిపాడులోని గణపతినగర్‌లో గల అమరవీరుల స్థూపం వద్ద ఈ సభ నిర్వహించనున్నారు. మామిడిపల్లి, మందస మండలం కొండలోగాం తదితర గ్రామాల్లోనూ ప్రచారం నిర్వహించారు. ఈ సభను విజయవంతానికి ప్రజలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు గొరకల బాలకృష్ణ, ఇఫ్టూ నాయకుడు పోతనపల్లి మల్లేశ్వరరావు, పీవైఎల్ జిల్లా నాయకుడు సార జగన్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు రాపాక మాధవరావు, ఆదివాసీ యువకులు, ఉద్దానం ప్రజలు పాల్గొన్నారు.




## మంత్రిని కలసిన ఎమ్మెల్యే ఎంజీఆర్

**పాతపట్నం, నవంబర్ 19(వార్త):** ఆహార ధాన్యాల నిల్వకు పాతపట్నం, హిరమండలం మార్కెట్ కమిటీ పరిధిల్లో గిడ్డంగులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. మంగళవారం ఆయన సచివాలయంలో మంత్రిని కలసి వినతిపత్రం సమర్పించారు. నిరుపేద గిరిజనులకు, ఇతరులకు తెల్ల రేషన్ కార్డుల స్థానంలో అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులను అధికంగా మంజూరు చేయాలని విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



## బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు



**పాతపట్నం, నవంబర్ 19(వార్త):** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని కార్మిక శాఖాధికారి శైలేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని సూచించారు. 18 ఏళ్ల లోపు వారిని ఎవరైనా పనిలో చేర్చుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ విభాగం కౌన్సిలర్ ధర్మాన సీతారాములు, సర్వ శిక్షా అభియాన్ జిల్లా కో–ఆర్డినేటర్ పూడి జనార్దనరావు, పాతపట్నం ఎస్ఐ బైరిశెట్టి లావణ్య, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ జి.మౌనిక, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఝాన్సీ లక్ష్మీభాయి జయంతి వేడుకలు

**ఇచ్ఛాపురం, నవంబర్ 19(వార్త):** స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో మంగళవారం ఝాన్సీలక్ష్మీభాయి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి, స్కూల్ మేనేజర్ కేసీ పూరి, ఉపాధ్యాయులు సురేఖ పట్నాయక్, పద్మజ, శాంతి, ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ పి.తేజస్, సెక్రటరీ మోహన్, ప్రియ, వైస్ ప్రెసిడెంట్ జి.హారిక, డి.హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్‌పీఎల్ జ్యోత్స్న పాల్గొన్నారు.



# ఘనంగా మరుగుదొడ్ల దినోత్సవం

**వంగర, నవంబర్ 19 (వార్త):** ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరని, ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. వరల్డ్ టాయిలెట్స్ డే సందర్భంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు, మహిళా సంఘాల నాయకులు, సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మరుగుదొడ్లుతో కలిగే ఉపయోగాలను వివరించాలని కోరారు. మరుగుదొడ్లను అందరూ పూర్తి స్థాయిలో వాడుకునేటట్లు అందరిలో చైతన్యం తేవాలని సూచించారు. బహిరంగ మలవిసర్జనతో కలిగే అనర్థాలను పూర్తిగా వివరించాలని కోరారు. కాలువల్లో చెత్త వేయకుండా గ్రీన్ అంబాసిడర్లకు తడి, పొడి చెత్త వేరు చేసి ఇచ్చేట్టు అవగాహన కల్పించాలన్నారు. మరుగుదొడ్లు లేని వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లోపింటి త్రినాథరావు, ఈవో పీఆర్‌డీ కెల్ల రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీచరణ్, ఉపాధి సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.





**సారవకోట, నవంబర్ 19(వార్త):** సారవకోట మండల పరిషత్ ఆవరణలో మంగళవారం టాయిలెట్స్ డే నిర్వహించినట్లు ఎంపీడీవో కృష్ణ మోహన్ తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం పురస్కరించుకొని ఇటీవల మండల పరిషత్ నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించాలని, మరుగుదొడ్ల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వైస్ ఎంపీపీ రామారావు, సర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.




**జలుమూరు, నవంబర్ 19(వార్త):** గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్వహణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా జలుమూరు, కరవంజ గ్రామాల్లో అవగా హన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీ డీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు విని యోగించుకోవాలని, అప్పుడే గ్రామాలు పరిశుభ్రత కలిగి ఉంటాయన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**మందస, నవంబర్ 19(వార్త):** బాలిగాంలో గల ఆదిత్య కళాశాలలో ప్రపంచ టాయిలెట్ డే సందర్భంగా మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలనే లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు సోమేశ్వరరావు, రవిశంకర్, కృష్ణారావు ఆధ్వర్యంలో బాలిగాంలో టాయిలెట్ ఆకారంలో విద్యార్థులు కూర్చున్నారు. భారీ ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ బొంగి ప్రవీణ్, మార్పు హరికృష్ణప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు



## చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

**పాతపట్నం, నవంబర్ 19(వార్త):** విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసై బంగారు జీవితం నాశనం చేసుకోవద్దని పాతపట్నం సీఐ వానపల్లి రామారావు అన్నారు. స్థానిక కిరణ్మయి డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల వాడకం, సైబర్ నేరాలపై సంకల్ప్ అవగాహనా కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను చైతన్య పరిచారు. అమరజ్యోతి స్కూల్‌లో ఎస్ఐ బి.లావణ్య విద్యార్థులకు విద్య ఆవశ్యకతను, గుడ్ టచ్..బాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు.

## మ్యాప్ పాయింటింగ్ నిర్వహణ



**నరసన్నపేట, నవంబర్ 19 (వార్త):** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం హిస్టరీ అధ్యాపకులు పీసీహెచ్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మ్యాప్ పాయింటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.లత, లైబ్రరీ ఇన్‌చార్జి పి.అన్నాజీరావు, లైబ్రేరియన్ డి.ఆనందరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## న్యాయాధికార సేవలను వినియోగించుకోండి



**నరసన్నపేట, నవంబర్ 19(వార్త):** న్యాయవాదులను పెట్టుకోలేని ముద్దాయిలు జిల్లా న్యాయాధికార సేవా సంస్థ ద్వారా సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. మంగళవారం ఆయన నరసన్నపేటలోని స్థానిక సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా జైల్లో ఉన్న మౌలిక పరిస్థితులను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జైలు సిబ్బంది, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన

నరసన్నపేట, నవంబర్ 19(వార్త):నరసన్నపేటలో మంగళవారం ఎస్‌వీసీటీ ఆధ్వర్యంలో చెత్త నుంచి సంపద తయారీ విధానాన్ని తమిళనాడుకు చెందిన శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో పట్టణ కళింగ వైశ్య కార్యదర్శి జామి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 19 (వార్త):** అఖిలభారత విద్యార్థి పరిషత్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వ మహిళ డిగ్రీ కాలేజీలో మంగళవారం నిర్వహించారు. జిల్లా కన్వీనర్ బోర గోపి, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, బీజేవైఎం అధ్యక్షుడు నరేంద్ర చక్రవర్తి, గురజాడ గాయత్రి కాలేజ్ డైరెక్టర్ సంయుక్త, దుర్గా వాహిని ప్రముఖ హైందవి , విభాగ్ కన్వీనర్, సాయి, జాయింట్ సెక్రెటరీ ప్రవీణ్, ఏబీవీపి సభ్యులు పాల్గొన్నారు.

# డ్రోన్ నిఘా నీడలో సిక్కోలు

* ఈ కెమెరాలతో అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్ట
* పట్టణ శివార నిర్మానుష్యమైన ప్రదేశాల్లో నేరాలకు చెక్
* జిల్లాలో ఇకపై సాంకేతికతతో నేరాల నియంత్రణ
* జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 19(వార్త):** జిల్లాలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, నేరాలను నియంత్రించుటలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న నిశితమైన ప్రదేశాలను ముందుగా గుర్తించి, గంజాయి వినియోగం, ఇతరత్రా చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెట్టేందుకు ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం శ్రీకాకుళం పట్టణ పరిధిలోని పాజల్ బేగ్ పేట, దత్తాత్రేయ ఆలయం వెనుక భాగాన ఉన్న స్మశాన వాటిక ప్రాంతం, నాగావళి నది పరీవాహక ప్రాంతమైన పెద్దరెల్లి వీధి, డే అండ్ నైట్ స్మశాన వాటిక , శాంతి నగర్ కాలనీ, నాగావళి రివర్ వ్యూ పార్కు, రిమ్స్ హాస్పిటల్ వెనుక భాగం, బలగ, డిసిసిబి మత్స్యశాఖ కార్యాలయం ప్రాంతం వెనుక భాగం, ఆర్ట్స్ కళాశాల, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న పాడుబడిన బిల్డింగ్స్ తదితర నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్స్ కెమెరాలతో నిఘా ఉంచామన్నారు. గంజాయి వినియోగం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో నేరాలను నియంత్రించుటకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని చెప్పారు. ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్ టీజింగు, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ప్రాంతాలు, కోడి పందాలు, పేకాటలు నిర్వహించేందుకు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను, నిశిత ప్రాంతాలను, తోటలు, బహిరంగ ప్రదేశాలను, పార్కులు, నదీ తీరాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి, నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్య కూడళ్ళలో ట్రాఫిక్ నియంత్రణ, మహిళలపై దాడుల నియంత్రణ, సుదూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టేందుకు డ్రోన్స్ వినియోగించి, నేరాలను కట్టడి చేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.

# పీఎం సూర్యఘర్ లక్ష్యాలు అధిగమించండి

* ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిష్ట్రీ వేగవంతం చేయాలి
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * పలు శాఖల ప్రగతిపై సమీక్ష



**శ్రీకాకుళం, నవంబర్ 19(వార్త):** పి.ఎం సూర్య ఘర్ నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో ఆధిగమించాలని, ఈ స్కీంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పంచాయతీ సెక్రటరీలు బాధ్యత వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎపి.సేవా, మీసేవ, పి.జి.ఆర్.ఎస్ సంబందించిన రెవిన్యూ, గృహ నిర్మాణ సంస్థ, సిపిఓ, రహదారులు భవనములు, విద్యా, పంచాయతీ, ఉద్యాన, ఎపిఈపిడిసియల్, డ్వామా, ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీ, ట్రాన్స్ కో సమన్వయంతో పనులు వేగవంతం చేసి ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. ఎస్సి, ఎస్టి రిమోట్ గ్రామాల్లో ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిష్ట్రీ) జారీ ప్రక్రియకి సంబంధించి ఆరా తీయగా జిల్లా విద్యాశాఖాది పురోగతి వివరించారు. విద్యార్థుల డేటా మ్యాచ్ కాకపోవడంతో పనులు పురోగతి లేదని ప్రత్యేక అధికారులు, తాహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఇఒలు ప్రత్యేక దృష్టిసారించి పుట్టినతేదీ ధ్రువపత్రం, ఆధార్ తప్పులను సరిచేసి ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వేపై దరఖాస్తులు వచ్చాయని, గ్రామ సభలో పరిష్కరించాలని, అందుకు సంబంధించి చేపడుతున్న ముందస్తు ప్రణాళికలపై ఆరాతీశారు. గ్రామాల్లో ఫిజికల్ వెరిఫికేషన్ చేసి పరిష్కారం చూపాలన్నారు. గ్రామ స్థాయిలో చేపట్టిన పనులపై రోజు వారి నివేదికలు పంపాలన్నారు. ప్రభుత్వ పెట్రోల్ బంక్‌ల ఏర్పాట్లపై టెక్కలి, పలాస, శ్రీకాకుళం ఆర్డిఓలతో మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల గుర్తింపుపై చేపడుతున్న పనులపై ఆరా తీశారు. కోర్టు కేసులపై సమీక్షించి అధికారుల వైపు నుంచి కోర్టు కేసులు పెండింగ్లో ఉండరాదని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ ప్రగతికి సంబందించి ఆర్డిఓలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, గృహనిర్మాణ సంస్థ అధికారులతో సమీక్షించి నేటికీ చేపడుతున్న పనులపై, నిర్దేశిత లక్ష్యాలు, పనుల పురోగతి, జియో ట్యాగింగ్ తదితర అంశాల పురోగతిపై ఆరా తీశారు. ఆర్డిఓలు సమీక్షలు చేపట్టి నిర్మాణాలు వేగవంతం అయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు జిల్లాలో గత నెలలో శంకుస్థాపన చేసిన నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. ప్రగతిలో నిర్లక్ష్యం వహించిన పలువురిపై క్రమ శిక్షణా చర్య తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న మరుగుదొడ్లు తప్పనిసరిగా వాడాలని, మరమ్మతులకు గురైన మరుగుదొడ్లను మరమ్మతులు చేసి రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాలన్నారు. బాగోలేని మరుగుదొడ్లను శుభ్రపరచి అక్కడ ప్రజలను ఆకట్టుకునే విధంగా బ్యూటిఫికేషన్ చేస్తే తప్పకుండా వస్తారని పేర్కొన్నారు. పన్నుల వసూలు ప్రక్రియ వేగవంతం చేయడంతో పంచాయతీల అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. పల్లె పండుగ వారోత్సవాలలో శంకుస్థాపన చేసిన సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పంచాయతీ రాజ్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావు, కొవ్వాడ ఉప కలెక్టర్ లక్ష్మణమూర్తి, కెఆర్సి ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాధ స్వామి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, ఐసిడిఎస్ పీడీ బి.శాంతి శ్రీ, జల వనరుల శాఖ ఎస్ఈ పి. సుధాకర్, సిపిఓ ప్రసన్నలక్ష్మి, డిఆర్డిఏ పీడీ కిరణ్ కుమార్, డిఎంహెచ్ఓ బి.మీనాక్షీ పలువురు అధికారులు హాజరయ్యారు.





# బైక్ దొంగలు దొరికారు!

* 20 వాహనాలు స్వాధీనం
* పోలీసుల అదుపులో ముఠా సభ్యులు
* ఆమదాలవలస పోలీసులకు ఎస్పీ ప్రశంస



**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 19(వార్త):** జిల్లాలో బైక్‌లను దొంగిలిస్తూ ఇతర రాష్ట్రాల్లో విక్రయిస్తున్న ముఠాను సిక్కోలు పోలీసులు పట్టుకున్నారు. పొరుగు రాష్ట్రానికి చెందిన ముఠా సభ్యులను ఆమదాలవలస పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాకు మంగళవారం వెల్లడించారు. ఆమదాలవలసకు చెందిన కరణం శ్రీనివాసరావు ఇంటి వద్ద అక్టోబరు 5న రాత్రి నిలిపిన ద్విచక్ర వాహనం మరుసటి రోజు ఉదయం కనిపించలేదని అక్కడి పోలీసుస్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటేష్ సిబ్బందితో కలిసి ఆమదాలవలస గేట్ వద్ద ఈ నెల 19న తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అదే ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న జడ్యాడ సోమేశ్వరరావు, సప్ప హరీష్, మదాసు ధనుష్‌లను పట్టుకుని దర్యాప్తు చేశారు. విచారణలో మెట్టక్కివలసలో నివాసం ఉంటున్న అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వెంకయ్యపాలెంకు చెందిన మైలపల్లి అర్జునరావు (దివ్యాంగుడు) కారుణ్య జగదీష్ సహాపై ముగ్గురికి ఆశ్రయం కల్పించాడని తేలింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాత్రి వేళ వారితో ద్విచక్ర వాహనాల చోరీలు చేయించేవాడు. అతని స్నేహితుడు ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా మినిగాన్‌కు చెందిన దారపు శశిగిరి, సమీప బంధువు సరుబుజ్జిలి మండలం తురకపేటకు చెందిన ఏరుపల్లి బాలాజీ సాయంతో అక్కడ విక్రయించడానికి వెళ్తుండగా ఆమదాలవలసలో పోలీసులు పట్టుకున్నారు. ఆమదాలవలస పోలీసుస్టేషన్ పరిధిలో 5, కాశీబుగ్గలో 5, శ్రీకాకుళం రూరల్‌లో 1, విజయనగరం1, విశాఖ మూడో పట్టణం 1, లావేరు 1, ఎచ్చెర్ల 1తో పాటు మరో ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.15.50 లక్షలు ఉంటుంది. గతంలో జడ్యాడ సోమేశ్వరరావుపై 5, కారుణ్య జగదీష్‌పై 7, సప్ప హరీష్‌పై 3 సహా శ్రీకాకుళం, బొబ్బిలి పోలీసు స్టేషన్లలో 15 కేసులు నమోదయ్యాయని ఎస్పీ వివరించారు. బైక్ దొంగలను పట్టుకున్న ఆమదాలవలస ఎస్ఐతో పాటు పోలీసులను ఎస్పీ అభినందించారు.

## ఆదిత్యుని ఆదాయం రూ.68.85లక్షలు

**అరసవల్లి, నవంబర్ 19 (వార్త):** ప్రత్యక్ష దైవం ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి హుండీలను మంగళవారం ఆలయ అనివెట్టి మండపంలో లెక్కించారు. ఈ ఏడాది ఆగస్టు 27 నుంచి ఈనెల 19 వరకూ లెక్కించగా నోట్లు రూపేణా రూ.67,09,160, చిల్లర రూపేణా రూ.1,76,540 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. అలాగే బంగారం 25 గ్రాములు, వెండి 1 కేజీల 600 గ్రాములు, విదేశీ మారక ద్రవ్యం నోట్ల రూపేణా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా: డాలర్లు 5, లీరసి :15, నేపాల్: 50, డిరామ్స్: 10, కాంబోడియా: నాయరా 500 వచ్చాయని తెలిపారు. శ్రీ హరి సేవా, సత్యసాయి సేవ సమితి, శ్రీవారి సేవ సమితితో పాటు ఆలయ సిబ్బంది ఈ లెక్కింపులో పాల్గొన్నారు. సీనియర్ సహాయకులు జి.వి. బి. ఎస్. రవి కుమార్, ఆమదాలవలస గ్రూప్ దేవాలయాల కార్యనిర్వాహణాధికారి తమ్మినేని రవి, ఆలయ అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ పర్యవేక్షించారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546